పంటలకు పరిహారం చెల్లించాలి

- క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందించాలి
- అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే గంగుల కమలాకర్

రైతు దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కార్పొరేషన్, ఏప్రిల్ 6: ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. యాసంగి పంట నుంచే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. తాము ఎలాగు అధికారంలోకి రాలేమన్న ఆలోచనతో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అనేక హామీలు గుప్పించారని ఎద్దేవా చేశారు. రైతుల ఉసురుపోసుకున్న ప్రభుత్వాలు పుట్టగతులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. సోనియా పుట్టిన రోజు వరకు రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాటమార్చుతున్నారని విమర్శించారు. పంటలకు చివరి తడి కూడా ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష గట్టి తెచ్చిన కరువు అని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతుల బతుకులు ఆగమయ్యాయని పేర్కొన్నారు. రైతులకు బోనస్ ఎగ్గొట్టేందుకే కమిటీల పేరుతో కాంగ్రెస్ కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. ప్రభుత్వ అసమర్థతతోనే ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటి పంటలు ఎండిపోయాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టవద్దని అప్పటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చౌహాన్‌కు లేఖ రాశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

రైతులను ఆదుకోవాలి

ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ కూడా అందించాలన్నారు. ఇప్పటి వరకు ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున అందించి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ వద్ద జరిగిన చిన్న సమస్యను సాకుగా చూపించి నీరు ఎత్తిపోయకపోవడంతో వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మధ్య మానేరు నుంచి మూడు టీఎంసీల నీళ్లు ఎల్ఎండీలోకి విడుదల చేసి తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, రాష్ట్ర సివిల్ సప్లయాస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, కార్పొరేటర్లు బుచ్చిరెడ్డి, యాదయ్య, రమణారావు, బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల ఉసురు పోసుకుంటే పుట్టగతులుండవు

ఎండిన వరిని చూపుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, తదితరులు

- ఎండిన పంటలకు ఎకరానికి రూ. 25 వేలు ఇవ్వాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతున్నది: మాజీ ఎమ్మెల్యే రసమయి
- రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్
- మానకొండూర్‌లో రైతుదీక్ష

మానకొండూర్, ఏప్రిల్ 6: అబద్ధాల పునాదిపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని.. రైతుల ఉసురు పోసుకుంటే పుట్టగతులుండవని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతుదీక్షలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు నష్టపోతే ఎకరానికి రూ. 25వేలు ఇవ్వాలని అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి అప్పుడు చెప్పినట్లే ప్రస్తుతం పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పథకాలను ఎగ్గొట్టడానికే కమిటీలను వేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే ప్రాజెక్టుల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో పచ్చని పంటలతో కళకళలాడిన తెలంగాణలో మళ్లీ 2014 కంటే ముందు ఉన్న కష్టాలు పునరావృతం అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రికెట్ మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేదన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రామరాజ్యంగా ఉంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాక్షస రాజ్యంగా తయారైందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా విడిచి పెట్టేదిలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, ఎంపీపీలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అబద్ధాలతోనే అధికారంలోకి కాంగ్రెస్

- రైతులకు అండగా నిలువడంలో పూర్తిగా విఫలం
- రైతు దీక్షలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

చిగురుమామిడి, ఏప్రిల్ 6: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రైతులను దగా చేస్తున్నదని హుస్నాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ ధ్వజమెత్తారు. శనివారం హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో రైతు దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. ఆరుగాలం శ్రమించిన రైతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. రాజకీయం చేయడం తప్ప రైతన్నలకు అండగా నిలువడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు క్వింటాల్‌కు రూ 500 ఇవ్వాలని, ఎండిన పంటలకు పరిహారంగా ఎకరానికి రూ 25 వేలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే అందించాలని, చనిపోయిన ప్రతి రైతు కుటుంబానికి రూ.25 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సాంబారి కొమురయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, మండల నాయకులు పెనుకుల తిరుపతి, బెజ్జంకి రాంబాబు, కల్వల రాజేశ్వర్ రెడ్డి, గ్రామాధ్యక్షులు కత్తుల రమేష్, ఎస్ కే సిరాజ్, రమేశ్, నాగెల్లి రాజిరెడ్డి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలి

- రైతుదీక్షలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రైతు దీక్షలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు

చొప్పదండి, ఏప్రిల్ 6: రాష్ట్రంలో పంట నష్టపోయిన ప్రతిరైతుకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.25వేలు పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. శనివారం చొప్పదండిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్షలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో రైతుభరోసా పేరిట కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్కహామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. రైతుబంధు విడుదలలో జాప్యం, కరెంట్ కోతలు, ధాన్యానికి రూ.500 బోనస్ హామీ ఇచ్చి నిలబెట్టుకోకపోవడమే కాకుండా కాంగ్రెస్ అనాలోచిత చర్యలతో 209 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేంతవరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మాజీ సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డా.అమిత్, అజయ్‌కుమార్‌గౌడ్, వినయ్, లక్ష్మణ్, జహీర్, జగన్‌రెడ్డి, నరేశ్ రావన్, మహేశ్, గంగయ్య, సదాశివరెడ్డి, మల్లేశం, శోభన్ బాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 6: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని దాసరి విజయ గార్డెన్ పద్మనగర్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ యుద్ధభేరి సన్నాహక సమావేశానికి విజయవంతం చేయాలని జిల్లా నాయకులు మేకల రవీందర్, బోనగిరి ప్రభాకర్ కోరారు. శనివారం పట్టణంలోని సిటీ సెంట్రల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా అల్గునూర్ చౌరస్తా నుంచి దాసరి విజయ గార్డెన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని, జిల్లా వ్యాప్తంగా ఆర్ఎస్‌పీ అభిమానులు, అన్ని కుల సంఘాల నాయకులు, లౌకికవాదులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు రఘుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED
jobs Apply Now!
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

PASSPORT LOST
★Guguloth Gangadhar S/o. Ramulu, 5-131, Thukya Thanda, Chinthamani Thanda, Rudrangi Mandal, Rajanna Sircilla Dist. My passport No. X6020003 Lost by Travelling from Rudrangi to Metpally. If any found please call 93912 84906.
NTK-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

నీళ్లిచ్చేదాకా వదలం

- రైతుల బాధ చూసి హృదయం చలించి పోయింది
- వారి కోసం అవసరమైతే కెనాల్ గేట్లు బద్దలు కొడతా..
- రైతు దీక్షలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నినదిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 6: హుజూరాబాద్ నియోజకవర్గంలో రైతులకు మరో తడి నీళ్లు అందించేదాకా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టనని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హుజూరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన ఒక్కరోజు రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. ఈ దీక్ష రాజకీయాల కోసం చేయడం లేదన్నారు. వారి బాధ, ఆవేదన చూసి తన హృదయం బరువెక్కిందని, అందుకోసమే రైతుల పక్షాన నిలబడుతున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని రైతులందరూ నీళ్ల కోసం పడే గోస చాలా దయనీయంగా ఉందన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క ఎకరం కూడా ఎండ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ దుస్థితి ఎందుకు ఎదురైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి రైతులకు సరిపడా నీళ్లు ఎందుకు అందించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పరిపాలన చేయడం చాతకాక పోవడంతోనే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతుల కోసం కేసీఆర్ కష్టపడుతూ పొలాల వెంట తిరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం సరదాగా ఐపీఎల్ మ్యాచ్ వీక్షించడం సిగ్గుచేటు అన్నారు. హుజూరాబాద్ రైతుల కోసం ఎంత దూరమైనా వెళ్తానని, అవసరమైతే వేల మంది రైతులతో గేట్ల వద్దకు వెళ్లి వాటిని బద్దలు కొడతానని హెచ్చరించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకుల మీద కోపం ఉంటే తమపైనే తీర్చుకోవాలి తప్ప, రైతుల పొట్ట మీద కొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, జమ్మికుంట చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, పార్టీ హుజూరాబాద్ పట్టణ, మండలాధ్యక్షులు శ్రీనివాస్, ఐలయ్య, కేడీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతు బంధు సమితి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని బలిగొన్న టిప్పర్

విజయ్(ఫైల్) వర్షిత (ఫైల్) సింధూజ (ఫైల్)

- మృతుల్లో ఇద్దరు అన్నాచెల్లెలు
- బోర్నపల్లిలో విషాదచాయలు

హుజూరాబాద్, ఏప్రిల్ 6: గ్రామస్తులందరితో కలిసి సంతోషంగా జాతరలో పాల్గొని ఇంటికి వెళ్తున్న ముగ్గురిని మృత్యువు టిప్పర్ రూపంలో బలిగొన్నది. మృతుల్లో ఇద్దరు అన్నాచెల్లెలు కావడం మరింత విషాదాన్ని నింపింది. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. శుక్రవారం బోర్నపల్లిలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లి జాతర నిర్వహించారు. గ్రామానికి చెందిన గంట వీరస్వామి, రేణుక దంపతుల కుమారుడు విజయ్(17), కుమార్తె వర్షిత(15), గంట కవిత కుమార్తె సింధూజ(18) జాతరలో పాల్గొన్న అనంతరం మోటారు సైకిల్‌పై ఇంటికి పయనమయ్యారు. మార్గమధ్యంలో గ్రామ నడిబొడ్డున మూల మలుపువద్దకు రాగానే ఎదురుగా మొరంలోడుతో టిప్పర్ వస్తుండడం గమనించి బండి నడుపుతున్న విజయ్ పక్కకు నిలిపాడు. అయితే వేగంతో వస్తున్న టిప్పర్ మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ఉన్నమట్టి పెళ్లలతో పాటు మొరం మొత్తం ఈ ముగ్గురినీ కప్పివేసింది. గమనించిన స్థానికులు వెంటనే మట్టిని తొలగించేలోపే అప్పటికే అన్నాచెల్లెలు విజయ్, వర్షిత మృత్యువాత పడ్డారు. కొన ఊపిరితో ఉన్న సింధూజను హుజూరాబాద్ సర్కారు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.

బోర్నపల్లి విషాద చాయలు

టిప్పర్ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంతో బోర్నపల్లి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. సింధూజ తండ్రి ఐదేండ్ల క్రితం చనిపోగా, ఇప్పుడు కూతురు కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ తల్లి దుఃఖాన్ని ఆపడం ఎవరితరం కాలేదు. విజయ్ హనుమకొండలో ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా, వర్షిత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మొన్న జరిగిన పదో తరగతి పరీక్షలకు హాజరైంది. సింధూజ వాళ్ల అమ్మమ్మ గ్రామం మాణిక్యాపూర్‌లో ఉంటూ హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసింది.

అంతలోనే అనంతలోకాలకు..

జాతరలో సంబురంగా విజయ్, వర్షిత, సింధూజ దోస్తులతో కలిసి డ్యాన్సులు చేశారు. సంతోషంగా జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఇంటికి ఒకే మోటారు సైకిల్‌పై తిరుగుముఖం పట్టారు. పెద్దమ్మ గుడినుంచి బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే వారి మరణవార్త విని గ్రామస్తులు దిగ్భ్రాంతి చెందారు. అప్పటివరకు జాతర ఉత్సవాల్లో మునిగితేలిన వాళ్లు అంతలోనే అనంతలోకాలకు వెళ్లడంతో కన్నీరుమున్నీరయ్యారు.

పరామర్శించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

బోర్నపల్లిలో జరిగిన విషాదకర ఘటనను తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ దవాఖానకు వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ తదితరులున్నారు. ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విచారణ చేపట్టాలి

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 6: అభిలాష్ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్ రావు శనివారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కాలేజ్ క్యాంపస్ నుంచి మార్చి 1న అనుమతి లేకుండా బయటకు వెళ్లి అదే నెల 27వ తేదీన బావిలో శవమై కనిపించిన డిప్లొమా విద్యార్థి అభిలాష్ మృతిపై విచారణ జరిపి ఘటన వెనుక ఎవరు ఉన్నా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి తల్లిదండ్రుల బాధను పట్టించుకోకుండా తప్పుడు కథనాలతో కొందరు క్షోభ పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ కళాశాలపై బురద చల్లే ఉద్దేశంతో సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు రాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బంగారు గొలుసు అప్పగింత

తెలంగాణచౌక్, ఏప్రిల్ 6: నగరంలోని బస్టాండ్‌లో శనివారం లత అనే ప్రయాణికురాలు బ్యాగ్‌లోని వస్తువులను తీస్తుండగా బంగారు గొలుసు కింద పడిపోయింది. సెక్యూరిటీ గార్డు ప్రభాకర్‌కు దొరకగా ఆర్టీసీ కంట్రోలర్ అంజయ్యకు అప్పగించారు. కాగా, లత బస్టాండ్‌కు వచ్చి గొలుసు పోయిన విషయం తెలిపింది. బస్టాండ్ ఏటీఎం రజనీకృష్ణ, జోనల్ సెక్యూరిటీ అధికారి బావు రావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టి గొలుసు అప్పగించారు. కాగా, సెక్యూరిటీ గార్డు ప్రభాకర్‌ను అధికారులు అభినందించారు.

ఆరోగ్యంపై అవగాహన

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 6: ప్రజలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హసీమ్ అలీ పేర్కొన్నారు. బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో శనివారం గుంటూర్‌పల్లిలో 'మన ఆరోగ్యం–మన హక్కు' పేరిట అవగాహన ర్యాలీ తీశారు. ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ హసీమ్ అలీ, ఎస్‌పీఎం విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ రాజమౌళి, డాక్టర్ ఫయాజ్, డాక్టర్ వాజీద, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథానికి స్వాగతం

గంగాధర, ఏప్రిల్ 6 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రచార రథం శనివారం గంగాధర మండలం మధురానగర్‌కు చేరుకోగా, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ప్రచార రథానికి ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీ ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు మేడి సుభాష్, గంగాధర వేణు, గంగాధర నగేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 6 : మండలంలోని నేదునూరు గ్రామ ఆశ కార్యకర్త ఇటీవల వడదెబ్బకు గురై మృతి చెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ ఎంపీటీసీ కనకం కొమురయ్య, నాయకులు బేతి శ్రీనివాస్ రెడ్డి, నూనె సురేశ్, వంగల శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 6: అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. కరీంనగర్ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో సంజీవరావు ఆధ్వర్యంలో ఎంపీవో, ఎంఈవో, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి స్థాయి కమిటీలను నియమించాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్యమ్మ, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ ప్రత్యేకాధికారి ఆంజనేయులు, ప్రత్యేక అధికారులు డాక్టర్ రామకృష్ణ, సత్యం, ఎంపీవో శోభ, ఏపీఎం భార్గవ్, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వీవోలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

శంకరపట్నం, ఏప్రిల్ 6: కొత్తగట్టు గ్రామంలో ఉపాధిహామీ పనులను డీఆర్డీవో శ్రీధర్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శి స్వప్న, టీఏ మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఖలీషా పాల్గొన్నారు.

ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా ఈశ్వర్

చిగురుమామిడి, ఏప్రిల్ 6: మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ తాటిపల్లి ఈశ్వర్‌ను హుజూరాబాద్ కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా హైకోర్టు నియామకం చేసింది. ఈ మేరకు హుజూరాబాద్ కోర్టులో శనివారం ఈశ్వర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా తాటిపల్లి ఈశ్వర్ నియామకంపై ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్, అంబేద్కర్ సంఘ నాయకులు కొమురయ్య, అంజయ్య, స్వామి, శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలల నిర్వహణ కమిటీ సమావేశం

శంకరపట్నం, ఏప్రిల్ 6: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాలల స్థితిగతులు, మౌలిక వసతులు, నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షించినట్లు ఎంఈవో వెంకట నర్సింహారెడ్డి వెల్లడించారు. త్వరలో పాఠశాలల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. డీపీఎం రమణయ్య, సూపరింటెండెంట్ శ్రీధర్, ఏఈ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పని చేయాలి

గంగాధర, ఏప్రిల్ 6 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. మధురానగర్ చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం పార్టీ యూత్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8న రామడుగు మండలం దేశరాజ్‌పల్లి వద్ద గల వసుధ కన్వెన్షన్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన యూత్, విద్యార్థి నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ యూత్, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెన్నాడి అమిత్‌కుమార్, రాష్ట్ర యూత్ నాయకుడు బోయినపల్లి ప్రతీక్, బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ ద్యావ మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు అనిల్, అజయ్, సంతోష్, వేణు, శ్రీకాంత్, వెంకటేశ్, ప్రవీణ్, రవి, మల్లేశం, వెంకటేశ్, ఏ వెంకటేశ్, అనిల్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ప్రాంగణ నియామకాలు

తిమ్మాపూర్, ఏప్రిల్6: మండలంలోని ఎల్ఎండీలో గల శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో అపోలో ఫార్మసీ సంస్థ చేపట్టిన ప్రాంగణ నియామకాల్లో 58 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. సంస్థ ప్రతినిధులు పలు దఫాల్లో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభ చూపించిన వారిని ఎంపిక చేసుకున్నారు. వారికి రూ. 1.8 లక్షల నుంచి రూ.2.2 లక్షల వార్షిక వేతనం ఉంటుందని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డితో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ నరసింహారెడ్డి, హెచ్‌వోడీలు డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ చంద్రమౌళి, రాంప్రసాద్, ధనుంజయ్, అధ్యాపకులు అభినందించారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 6: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఆదివారం కరీంనగర్‌కు రానున్నారు. హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నవీన్ రావు తల్లి దశదినకర్మ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

తిమ్మాపూర్, ఏప్రిల్6: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన జేఎన్టీయూ యూనివర్సిటీ అంతర్గత కళాశాలల టోర్నమెంట్ పోటీల్లో పాల్గొని కబడ్డీ క్రీడలో ద్వితీయ బహుమతి సాధించగా.. శనివారం విద్యార్థులను కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి అభినందించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, ఏవో రామారావు, పీడీ సునీత, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.